వలయం

గేటు తీసి లోపలికి అడుగు పెట్టాను.

మామగారు వీధి అరుగు మీద కూర్చుని ఉన్నారు.

"నువ్వా, అమ్మా! ఉత్తరం రాయ లేదేం? [illegible] టెలిగ్రా[illegible] [illegible]" అంటూ [illegible].

"ఎవరూ వస్తే?" అంటూ పక్క గదిలోంచి రమణా, శాంతా, అమ్మలూ బయటికి వచ్చేరు.

"అరే, వదినే! అమ్మోయ్! వదినొచ్చిందేవ్!" ఇంట్లోకి కేకెట్టింది అమ్మలు.

"రావనుకున్నానుస్మీ! వచ్చేవే!" అన్నాది శాంత.

"వదిన వస్తుందని నాకు తెలుసు!" అన్నాడు రమణ. శాంత తను రావనుకోవడమూ సబబే. రమణ వస్తాననుకోవడమూ సబబే. తనకి నవ్వొచ్చింది. రావడం, రాకపోవడం రెండూ సబబులే! ప్రతి విషయం అంతే! ఎటువాళ్ళకి అటు పక్క సబబూ, ఏది అయినా కారణం దొరుకుతాయి. కాస్త తర్కం ఉండాలి కాని రెండింటినీ సమర్థించవచ్చు.

లోపల్నుంచి అత్తగారూ, ముసలమ్మ గారూకూడా బయటికి వచ్చేరు. పొజ్జ చేసుకుంటూ లేచి వచ్చేరేమో ముసలమ్మ గారు చిన్న గావంచాగుడ్డ కట్టుకుని ఉన్నారు. [illegible] ముసుగు వేసేలేదు. మెళ్ళో పెద్ద రుద్రాక్షల తాళం గావంచా పైనుంచి వేళ్ళాడుతూంది.

"వచ్చేవా, మనవరాలా! రాజేడీ? వాడు రాలేదా? ఉత్తరం రాకపోతే ఇద్దరూ కలిసి వస్తున్నారూ, ఎందుకు రాయడమని మానేసి ఉంటార్లే అనుకున్నాం. స్టేషన్ నుంచి ఒక్కర్తివే వచ్చేవా?"

అత్తగారు నా చేతిలో సూటుకేసు తీసుకున్నారు.

"వదినకేం భయం అనుకున్నా!" అంటూ సాగదీసింది శాంత.

రాజుతో తర్కించి, రాజుని ఒప్పించి రావడమే బ్రహ్మాండమై పోయింది. నాకు ఉత్తరం రాయడానికి సావకాశం ఎక్కడ దొరికింది? రాసినా, రాయకపోయినా ఒకటే అంటాడు రాజు! స్టేషన్ నుంచి ఇంటికి వెళ్ళలేకపోతానా! !

నా చేతిలో ఉన్న గాగుల్సు తీసుకున్నాడు రమణ.

"ఆడవాళ్ళు గాగుల్సు పెట్టుకోడం ఏంట్రా!" అంటూ అమ్మలు ముందుకు వచ్చింది.

ఈ 'గాగుల్సు' ఆడా మగా—ఇద్దరూ పెట్టుకోవచ్చు. రమణ గాగుల్సు పెట్టుకుని వీధిలోకి పరుగెట్టేడు.

"ఏం రోజులివో ఏం లోకమో! అమ్మాయి పూర్తిగా చిక్కిపోయింది

—దాగంటి తులసి

కదండీ, అత్తయ్యా?" ముసలమ్మగారితో అత్తగారు అంటున్నారు.

"పొద్దున్న ఎప్పుడనగా బయులుదేరిందో ఏమో స్నానానికి నీళ్ళు పెట్టు. రెండు మెతుకులు తిని పడుకుంటుంది."

నాకు తెలుసు. ఎంత అవుననుకున్నా, ఎంత కాదనుకున్నా వీళ్ళంతా నా వాళ్ళు. రాజు నా వాడయేక వీళ్ళు పరాయి వాళ్ళు ఎలా అవుతారు? అయితే రాజే వీళ్ళని పరాయివాళ్ళుగా అనుకుంటున్నాడు. తల్లీ, తండ్రీ, బామ్మగారూ, చెల్లెళ్ళూ, తమ్ముళ్ళూ అందరూ రాజుకి పరాయి వాళ్ళే! ఈ బంధాలు తెంపుకోకపోతే వీల్లేదు అంటాడు. "పట్టుకుని వేళ్ళాడి వేళ్ళాడి ఇన్నాళ్ళు పడ్డ బాధంతా చాలు! మనస్సులోంచి వీళ్ళని తీసేస్తేనే పని చెయ్యగలను! నే నేమన్నా అవగలను!! నువ్వన్నా అంతే! ఆదర్శాలు! త్యాగాలు! కర్తవ్యాలు! దిబ్బాదిరుగుండం! నథింగ్! ఎవడికి వాడు తను తనుగా నిలబడి మీదికి లేవాలి. వీళ్ళు నిన్ను నిన్నుగా పైకి వెళ్ళనివ్వరు. వాళ్ళు బయట పడలేరు. వాళ్ళతో నిన్నూ కిందికి దిగలాగేస్తారు! నువ్వూ వాళ్ళ మాటలు మాట్లాడినన్ను దిగలాగకు!"ఇదీ వరస! రాజు చేసే తర్కం చిత్రంగా ఉంటూంది. మొదట్లో ఎబ్బెట్టుగా వినిపించేది. ఈ మధ్యే రాజు ఇల్లాగా తయారయేడు. పిరుటివరకూ ఈ తర్కవితర్కాలు ఏం లేవు.

స్నానంచేసి వచ్చేసరికి చిట్టి వీధిలోంచి వచ్చేడు.

"వదినా! ఎప్పుడొచ్చేవ్? అమ్మయ్య! నువ్వు వచ్చేవు! మంచిదయింది. నాలుగ్రోజులూ ఉంటావుగా! మా కెమిస్ట్రీ లెక్చరరు ఓ కుర్రకుంకలే! వాడికి చెప్పడం రానూ రాదు, మా కుర్రాళ్ళు చెప్పనివ్వరు! హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంటా? ఆయన క్లాసే తీసుకోరు. కాస్త చెపుతావు కదూ?" చిట్టి అడిగేడు. బి. ఎస్‌సి. సెకండియర్. యూనివర్సిటీ పరీక్ష. ఈ ఊళ్ళోనే రాజూ, నేనూ ఉంటే పిల్లలకి ఇబ్బంది ఉండేది కాదు.

"ట్యూషన్‌కి వెళతాను, అన్నయ్యా! లేకపోతే ఫస్టుక్లాసు రాదు. కాలేజీలో తిన్నగా చెప్పడం లేదు. చెప్పేది నాకు అర్థం కావటం లేదు. అమ్మా, నాన్నా ట్యూషనూ లేదు గీషనూ లేదు అంటున్నారు. నాన్నకి నువ్వో ఉత్తరం రాయి, అన్నయ్యా!" అంటూ ఉత్తరాలు రాసేడు చిట్టి—తెలివైనవాడు! చిట్టి ఉత్తరాలకి రాజూ, నేనూ ఏం జవాబు రాయగలం? ఇద్దరికీ వచ్చే ఆ స్కాలర్‌షిప్ డబ్బులో సహాం ఇంటికి పంపుతూనే ఉన్నాము.

చేదునిజాలు తెలియనంతవరకూ మనసు వెన్నెలలు నింపుకుని పరుగులు తీస్తుంది. సమస్యలు వలయంలా అల్లుకుని నిలదీసినప్పుడు వర్తమానంలో గులాబులకు బదులు నాగజెముళ్లు వేళ్లు తన్నుతాయేమో?

మామగారి జీతం, ఆ డబ్బూ—మొత్తం కలిపి ఇల్లూ, పిల్లల చదువులూ ఎలాగో వెళ్ళబోస్తున్నారు! చిట్టి ట్యూషన్‌కేం వెళతాడు?

ఏం కాలేజీలో ఏం లోకమో! ఏం లెక్చరర్లో ఏం చదువులో! కాలేజీల్లో ఏం చెప్పరు! ఇళ్ళ దగ్గర ట్యూషన్లు చెపుతారు!

మనస్సంతా పాడయింది. నీళ్ళు పోసుకొచ్చిన 'ఫ్రెష్‌నెస్' అంతా తుడుచుకుపోయింది. బతుక్కి హాయి ఎక్కడ? దిగులు పట్టుకుంది!

ఈ రీసెర్చిలో ఇద్దరం చేరకుండా ఉంటేనే బాగుండేదేమో! ఇద్దరం సైన్సు వాళ్ళం! పోస్టుగ్రాడ్యుయేట్లం! ఫస్టుక్లాసు స్టూడెంట్లం! మా పెళ్ళయిన వెంటనే మమ్మల్నిద్దర్నీ చూసి ఎంత మంది అసూయపడ్డారని! జోడీ కుదరడమంటే అలా కుదరాలి అని ఎంత పొగిడేరని! ఇద్దరికీ స్కాలర్‌షిప్పులు దొరికి ఇద్దరూ రీసెర్చిలో జాయినయ్యేసరికి 'ప్రామినెంట్ ఫిగర్స్' అయిపోయేము. అందరి కళ్ళలోనూ పడ్డాము! సైంటిస్టు దంపతులు! క్యూరీ దంపతులు! అంతటివాళ్ళవాలనే తపన! ఆశ! ఆశయం! ఇటు కుటుంబాలు, అటు కుటుంబాలు అంతా సంతోషించేరు. గర్వపడ్డారు. కాని, ఏం లాభం? నాలుగేళ్ళు గడిచేయి! ఈ యూనివర్సిటీలు! ఈ రీసెర్చిలు! ఈ చదువులు! ఉత్సాహం చప్పగా చల్లారిపోయింది! ప్రొఫెసర్లు అప్‌టుడేట్ నాలెడ్జితో ఉండరు. సైంటిఫిక్ జర్నల్సు చదవరు! వాళ్ళు పని చెయ్యరు. పని చేద్దామన్న పట్టుదలతో ఉన్న పిల్లల్ని ప్రోత్సాహపరచరు సరికదా, నీళ్ళు కార్చేస్తారు. నిరంతరం అధ్యయనం చెయ్యందే ఆచార్య అర్హత లేదన్న ప్రాథమిక విషయం మరిచిపోయిన గురువులు! వాళ్ళ జ్ఞానం పెద్ద ఫుల్‌స్టాప్‌తో ఆగిపోయింది! తాము తమపైనున్న 'కుర్చీ'కి ఎలా ఎగబాకడమా అన్న తాపత్రయంతో ఆ రాజకీయాల్లో పడి కొట్టుమిట్టాడే వాళ్ళకి అప్ టు డేట్ నాలెడ్జి ఎలా ఉంటుంది? జర్నల్సు రిఫర్ చేసే తీరుబడి ఎక్కడ దొరుకుతుంది? అన్ని హంగులతో ఓ మంచి ఇల్లు, సోఫాసెట్లు, డైనింగ్ సెట్లు, రిఫ్రిజిరేటర్లు, కారు, డబ్బు, హోదా—కావాలి! వీటి కోసమే పాట్లు! రోజు రోజుకీ దిగజారిపోతున్న గురువులు! వీటన్నిటిమధ్యా మీదికి లేచి డాక్టరేట్లు పుచ్చుకుని గురువులని మించిన శిష్యులు ఉండటం లేదా? లేకేం? ఉంటున్నారు. కాని, వాళ్ళ యోగ్యతలు వేరు! ఆ యోగ్యతలు రాజుకీ లేవు, నాకూ లేవు! డబ్బున్నవాళ్ళం కాము! పెద్దవాళ్ళెవరికీ సంబంధీకులం కాము! పుల్ ఉన్నవాళ్ళం కాము! కనీసం నేను బ్రాహ్మణపిల్ల కాకుండా ఉన్నా ఈపాటికి రీసెర్చి పూర్తి అయిపోయేది! రాజు ప్రొఫెసరుమరీ అన్యాయం! ఎప్పుడూ యూనివర్సిటీలో ఉండే ఉండడు. ఈ మీటింగో, ఆ మీటింగో, ఏదో ఒ రకం దేశం—అంతా తిరుగుతూనే ఉంటాడు. పెద్దవాడు!గొప్పవాడు!ఆయన ఈతిరుగుడుతో సైన్సు పురోగమిస్తూందా? ఆయన బాంక్ బాలెన్సు పెరుగుతూంది!! సనాతనుడు! ఆర్. ఎస్. ఎస్. వాడు! ప్రోగ్రెసివ్ కబుర్లు చెప్పే రాజంటే ఆయనకి ఒళ్ళు మంట! రాజూ, తనూ వలయంలో చిక్కుకున్నారు! కొట్టుకుంటున్నారు! యూనివర్సిటీ చుట్టూ బ్రహ్మజెముళ్ళు! విజ్ఞానం చుట్టూ నాగజెముళ్ళు!

పొరపాటే చేసేమని అనిపిస్తూంది. అలా అంటే రాజు కస్సుమంటాడు. " 'ఏంబిషన్' ఉండడం పొరపాటా? ఏదో అవుదామనుకోవడం పొరపాటా? పొరపాటు నీదీ, నాదీ కాదు! చుట్టూ ఉన్న విషపురుగులది!" రాజుని కదిపితే ఇల్లాగానే మాట్లాడతాడు! మాట్లాడేది పచ్చి నిజం అయినా, చుట్టూ ఉన్నవాళ్ళు రాజుని 'ఉగ్రవాది' అంటారు. చుట్టూ జరుగుతున్న పొరపాట్లని, అన్యాయాల్ని తర్కయుక్తంగా కారణాలతో సహా చెప్పేవాడు దేశంలో 'యంగ్ టర్క్' అవుతున్నాడు! రాజుని సమర్థిస్తూ నేను మాట్లాడితే భర్త మాటలకి తందానతాన పాడుతూంది అంటారు! ! ఈ పరిస్థితుల ఉక్కిరి బిక్కిరిలో బతుకుతో ఎక్కడ రాజీ పడడం?

"వాడుకూడా వస్తాడనుకున్నాం. పండక్కి పబ్బానికి కూడా ఇంటికి

ఆకాంక్ష

భాస్కర స్వర్ణాంబ

వత్సరాని కొక్కసారి వచ్చు మకర సంక్రమణం
ఉత్సాహం పొంగి మదిని మధురోహారోహణం!
ఈ పచ్చని సంక్రాంతికి...
మీ మెచ్చిన ఆశయాల సస్యలక్ష్మి పండాలి;
ఈ పచ్చని సంక్రాంతికి...
మీ నచ్చిన కోరికల బంతిపూలు విరియాలి;
ఈ పచ్చని సంక్రాంతికి...
సంతోషం మీ హృదిలో గొబ్బితట్టి పాడాలి;
ఈ పచ్చని సంక్రాంతికి...
మధురోహలు మీముంగిట రంగవల్లులేయాలి!! *

రాకుండా చెయ్యాల్టే ఆ రీసెర్చి! నాకు తెలీకడుగుతా— ఇంకా ఎన్నేళ్ళట ఈ చదువు! వాడూ నీలాచిక్కి శల్యమయ్యేడా? ఏమన్నా బాగున్నాడా?'' ముసలమ్మగారు అడుగుతున్నారు.

"శాంత ఉషా స్కూలుకి వెళుతోందే. ఇంట్లో ఉత్తినే కూర్చుంటే ఏం తోస్తుంది? అందుకని నేనే వెళ్ళమన్నాను. దానికీ ఖర్చేఅనుకో. గుడ్డలు కొనందే వాళ్ళు మాత్రం ఏం చెపుతారు? పాతగుడ్డలు పట్టుకెళితే నేర్పరు సరిగదా, ఎగతాళి చేసి నవ్వుతారుట! అమ్మలు టెన్తులోకొచ్చిందా ఏం చేస్తుందో మరి? తిన్నగా చదవదు. ఎప్పుడూ పుస్తకం పట్టుకోవడమే కనిపించదు. నా మొహం! వాళ్ళిద్దరికీ పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. శాంత దగ్గర అది నేర్చుకుంటుందా? ఇరవైనాలుగ్గంటలూ కీచులాడుకుంటూనే ఉంటారు. అదెప్పుడో పాసయింది. అన్నీ మరిచిపోయింది. దానికేం రాదంటుంది. అమ్మలు నీకు రాదు అంటే శాంత ఎగురుతుందనుకో. కాని, మనలో మన మాట, పాసయి అప్పుడే నాలుగేళ్ళవుతోందా? ఇంట్లో ఉత్తినే కూర్చుంటే మరిచిపోదూ? చదివిస్తే బి. ఎస్‌సి. అయిపోయి ఉండేది. సంబంధాలా? చూస్తూనే ఉన్నారు మీ మామగారు! డబ్బు పొయ్యందే కుదరవే, తల్లీ! చదువుకున్నదానివి! లోకం తెలిసున్నదానివి! నీకు తెలీనిదేముంది? మీ ఇద్దరి రీసెర్చి పూర్తవాలి. పిల్లలు ఎదిగి రావాలి. అంత వరకూ ఈదాల్సిందే. ఏం చేస్తాం?''

ఎమ్. ఎస్‌సి. ఫస్టుక్లాసులో పాసయిన నాకూ కట్నం ఇస్తేనే రాజు దొరుకుతు! నా తండ్రి ఈ ఉచ్చుల మధ్యే ఉరి పడుతున్నా నాకు రాజుని వెదికి తెచ్చి ఇచ్చేడు! రాజుని చూసి ఇద్దరమూ స్నేహితులై, సహకర్ములై ఆదర్శంగా జీవించవచ్చుని మురిసిపోయాను. జీవితపు చేదునిజాలు పూర్తిగా తెలీని రోజులవి!

శాంత కోసం ఆరాటపడుతున్న అత్తగార్ని ఎలా ఊరడించాలి? వయస్సు మళ్ళిన అత్తగారు నన్నూ పెద్దదానిగా చేసి మాట్లాడుతున్నారు! నేనూ ఎత్తుగా ఎదిగిపోయాను. నిజమే! అయితే ఈ ఎదుగుదలతో ఈ ప్రశ్నలకి జవాబులు చెప్పగలనా? మెట్రిక్యులేషన్ పాసయిన శాంతకి డబ్బు పొయ్యందే మొగుడు దొరుకుతాడా? నేను తెచ్చిన కట్నం మిగిలే ప్రశ్నే లేదు. పెళ్ళికి ముందే, రాజు చదువుకీ ఇంటికీ అయిన అప్పు తీర్చడానికి ఆ కట్నం సరిపోయింది!

"రెండోవాడి సంగతి అడక్కమ్మా! వాడెవరి మాటా వినడు! ఎవరన్నా భయం లేదు. భక్తీ లేదు. వాడితో మాట్లాడ్డమంటే మాకే భయం. ఇప్పుడప్పుడే ఇంటికి వస్తాడా? వాడి మీటింగులూ, వాడి పనులూ పూర్తిఅయి ఏ రాత్రప్పుడో వస్తాడు! వాడే వంటింట్లోకి వెళ్ళి అన్నం పెట్టుకుని తింటే తింటాడు. లేకపోతే అలాగే పడుకుంటాడు! పోతే పోయింది పరీక్ష. మళ్ళీ కట్టకూడదూ? పరీక్షలు పోయినవాళ్ళు మళ్ళీ మళ్ళీ కట్టి పాసవటం లేదూ? మీరు చదివే చదువులు చదువులు కావట! ఈ డిగ్రీలు దండగట! ఈ చదువులు చదవక పోవడమే మంచిదిట! బి. ఎ. పోయిందన్న చింతే వాడికి లేదు! పరీక్ష పోయి జ్ఞానోదయం అయిందంటాడు. నాకేం బోధపడదనుకో. చిట్టిగాడు చెపుతాడూ— 'చిన్నన్నయ్య విప్లవం తెస్తాడు! మీటింగులూ అవీ అందుకే చేస్తూ ఉంటాడు' అని! ఒక్కొక్కసారి వాణ్ణి చూస్తే భయం వేస్తోంది. బెంగగా ఉంటోంది! రాజు వస్తే వీడి సంగతి ఏమన్నా కనుక్కుంటాడేమో, కేకలేసి ఓ దారికి తెస్తాడేమో అనుకున్నాను. వాడురానేలేదు. నువ్వయినా కాస్త కనుక్కో, తల్లీ.''

పెద్దమరిది కృష్ణుడి గురించి రాజుకీ, నాకూ తెలియక పోవడమేం? తెలుసు! కృష్ణుడు ఉగ్రుడు! అత్తగారికి కృష్ణుడు అర్థం కాడు. నాకు అర్థం అయినా నేను అత్తగారికి బోధపరచలేను!

"పోనీ చదువంటే మానీసేడు. ఎందులో అన్నా బుర్ర దూరుస్తే ఎంత బాగుణ్ణు! వేణ్ణీళ్ళకి చన్నీళ్ళు! వినే వినిపించుకోడు. మీ మామగారి కష్టం పెద్దవాడైనా వాడికి బోధపట్టం లేదు. బాధ్యత చెపితే వస్తుందా? దానంతటది రావాలి గాని!''

కొడుక్కి చెప్పుకోవలసిన బాదరబందీ అంతా కొడుకు రానందుకు నాతోనే చెప్పుకుంటున్నారు. అవును. నేను కొడుకుతో సమానమైనదాన్నే! రాజు పెద్దకొడుకు. నేను ఇంటికి పెద్దకోడల్ని, అంతేనా? కొడు కెంత గణించగలడో నేనూ అంతే గణించగలను. అత్తగారు, మామగారు, చిన్న మరుదులు, ఆడపడుచులు, ముసలమ్మగారు ఇంటిల్లిపాదీ నన్నిలా చూడ్డానికి కారణం అదే! ఒక్క కొడుకు మీదే కాదు ఆధారపడత! కొడుకూ, కోడలూ ఇద్దరిమీదా ఆధారపడి మీరిద్దరే ఈ ఒడ్డు లాగి సంసారాన్ని ఓ ఒడ్డుకి చేర్చాలి అంటున్నారు!



రాజు చూడబోతే వీటన్నిటికీ దూరంగా ఉండాలనే నిశ్చయాని కొచ్చేసేడు. నేనేమన్నా తర్కం పెరుగుతూంది కాని, లాభం లేకపోతూంది!

"దశరా దశమీ లేదు, గిశమీ లేదు. సబ్మిట్ చెయ్యాల్సిన పేపర్లు పడి మూలుగుతున్నాయి. నువ్వూ వెళ్లక్కర్లేదు. నేనూ వెళ్లక్కర్లేదు. వెళితే అయ్యే డబ్బు కావాలంటే ఎమ్. ఓ. చేద్దాం" అన్నాడు రాజు.

"డబ్బేకాదు ముఖ్యం. మనిద్దర్నీ చూసి చాలా రోజులైంది. ఎప్పటికప్పుడు రండి, రండని మీ అమ్మగారు ఉత్తరాలు రాస్తున్నారు. ముసలమ్మగారు సరేసరి. పిల్లల సంగతి అడగే అక్కర్లేదు. వాళ్ల సెంటిమెంటుని మనం కాస్త చూడాలి" అన్నాను నేను.

"సెంటిమెంటుట! సెంటిమెంటు! నువ్వూ ఉత్తి మామూలు ఆడదానిలా మాట్లాడుతున్నావ్! డబ్బు తగలెయ్యడం తప్ప ప్రయోజనం సున్నా. నువ్వెళ్లిపోతే నా పేపర్లు టైప్ ఎవరు చేస్తారు?" రాజు విసుక్కున్నాడు. అసలు ఈమధ్య రాజుకి విసుగు ఎక్కువైపోతూంది. అసహనం పెరిగి పోతూంది. రాజు మారి పోతున్నాడు. నాకు తెలుసు. వీటన్నిటికి కారణాలు ఉన్నాయి. కారణాలు తెలిసి ఏం లాభం? వీటిని వేటినన్నా సరిచెయ్య గలనా? ఎందుకీ వివేకం? ఎందుకీ విచక్షణ? రాజుకి హెల్పు చెయ్యలేక పోతున్నాను. ఇంటికి హెల్పు చెయ్యలేక పోతున్నాను. నాకు నేను ఏమీ కాలేక పోతున్నాను. అత్తగారు, మామగారు, ముసలమ్మగారు ఎవరికి వారు రైటే. పిల్లలు వాళ్లకి వాళ్ల రైటే. కృష్ణుడు? అతనికి అతనూ రైటే! రాజు? రాజుకి రాజూ రైటే!

రాజు ముందే చెప్పేడు. "ఇంటికి వెళ్లేవా మరింత దిగజారి కుంగిపోయి వస్తావ్. ఉన్న కాస్త ఉత్సాహం ఎగిరి పోతుంది. నీ మూడ్స్ పాడవడమేగాక నన్నూ చంపుతావ్! కొన్నాళ్లవరకూ మళ్లీ పనిలో పడలేం! చేసే దేమన్నా ఉందా? ఊహుఁ! చెయ్యగలిగేదేమన్నా ఉందా? ఊహూఁ! నథింగ్!"

రాజు ఎస్కేపిస్టు అయిపోతున్నాడని నేను దెబ్బలాడాను. "ఎస్కేపిస్టు నేమిటి? పలాయనవాది! అన్నిటినీ దులిపేసుకుని దూరంగా ఉండదలుచుకుంటేనే!" అని రెచ్చిపోయేడు.

అత్తగారికి మాత్రం తెలీదూ? ఈ బాధలన్నీ క్షణంలో తీరేవి కావనీ, నేను కాని, రాజుగాని ఏం చెయ్యలేమనీ!! వయస్సూ, బతుకూ ఆవిడకి పాఠం

భం భం శంఖారావం ఫోటో—ఆర్. ఉదయభాస్కర్

చెపుతూనే ఉన్నాయి. అయితే వీళ్లందరి మనస్సులోనూ అట్టడుగున ఉన్న భావం నాకు తెలుస్తూనే ఉంది. గట్టిగా ఆ మాట వాళ్లు అనటం లేదు. అనలేక పోతున్నారు! ఈకాటికీ రీసెర్చిలు మానేసి ఇద్దరూ ఉద్యోగాలు చేస్తే ఓ దరికి చేరవచ్చునని మధ్య మధ్య నాకూ అనిపిస్తూంది. అయితే ఇంత కాలం శ్రమపడి డాక్టరేటు పుచ్చుకోకుండా ఉండడం? నామోషీకి నామోషీ?! సమయానికి సమయం దండగ!! ఉద్యోగాలన్నా ఏవీ? ఎదురుగా!! బాధలన్నీ ఏకరువు పెడితే వినడానికి తన వాళ్లన్న వాళ్లు ఎవరన్నా కావాల. సానుభూతితో ఊఁ కొట్టేవాళ్లు ఉంటే కాస్త ఊరట!! పండక్కి వచ్చి ఆ ఊరటే కలగ చేద్దా మనిపించింది! మారిపోతున్న రాజుకీ, మా మీద ఆశ పెట్టుకుని ఆధారపడి ఉన్న వీళ్లకీ నేను సేతువు! ఈ సేతువూ కూలిపోయేటట్లు ఉంది! •

"బొమ్మలకొలువులు వదినని తీసుకెళ్లి చూపించవే, శాంతా! నువ్వూ నలుగు రిళ్లకీ వెళ్లినట్టూ అవుతుంది, చూసి నట్టూ అవుతుంది. బామ్మగారు చూసి వచ్చేరు. అమ్మలూ, నేనూ వెళ్లివచ్చేం. అందరూ అడగడమే—శాంత రాలేదేమండీ? అని! వెళ్లమ్మా, శాంతతో నాలుగు కొలువులూ చూసిరా. మా రోజుల్లో ఉన్న సరదాలు మధ్యకాలంలో పోయినా మళ్లీ ఈ కాలపు పిల్లలు వాటికే ఎగబడు తున్నారు. బొమ్మలకొలువులూ పెడు తున్నారు. పేరంటాలకీ వెళుతున్నారు. ఎటొచ్చీ కుంకంబరిణ పట్టుకుని వెళ్లి పిలవటంలేదు! కార్డులు పంచిపెడు తున్నారు, కార్డులు!" అత్తగారు శాంతకీ చెప్పేరు. నాకూ చెప్పేరు. శాంత ఊఁ ఆఁ అనలేదు, కదల్లేదు.

"ఏమే, వెళ్లవా? ఇదీ, తల్లీ, వరస! ముంగిలా ఇంట్లోనే కూర్చుంటోంది! ఎలాగో నా బాధ పడలేక అడపా స్కూలుకి వెళుతోంది! ఎవరింటికీ వెళ్లదు. ఏమన్నా అంటే వాళ్లంతా కాలేజీలో చదువుతున్నారు. తనతో తిన్నగా మాట్లాడరు. వాళ్లకి గర్వం, టెక్కు, మిడిసిపాటు అంటుంది! అదో గోడలా తయారవుతోం దనుకో! వదిన చదువుకున్నది కాదా! వాళ్లకంటే ఎక్కువే చదువుకుంది. వదినతో ఎలా మాట్లాడుతున్నావ్ అంటే, వదిన చదువుకున్న దానిలా కనిపించదు అంటుంది. ఏంచెప్పమంటావ్? అమ్మలూ, అది గుమ్మం కదలదు. వదిన్ని నువ్వు తీసుకెళ్లవ్!"

వచ్చిన దగ్గర్నుంచీ చూస్తున్నాను— శాంత అదో మాదిరిగా ఉంది. పెళ్లై నేను వచ్చేసరికి మెట్రిక్యులేషన్ పాసయింది! ఆ చకచకా, ఉత్సాహం ఇప్పుడెక్కడా లేవు. శాంతకి తక్కువతనం పట్టుకుంది. ఇన్ఫీరియారిటీతో బాధ పడుతూంది! మగపిల్లల చదువులకే డబ్బు పెట్టడానికి అల్లల్లాడిపోతూ ఉంటే శాంతని కాలేజీలో ఎక్కడ చేరుస్తారు! ఇంట్లో కూర్చో పెట్టేరు! పెళ్లయేదాకా గోళ్లు గిల్లుకుంటూ కూర్చోమన్నారు! ఆ పెళ్లి ఎప్పుడవుతుందో ఎవరికీ తెలీదు!

కాలేజీలో చదువుతున్న అమ్మాయిలు, వాళ్ల వేషభాషలు, మాట తీరూ, ఏదో పెద్ద చదువు చదివేస్తున్నామన్న టెక్కూ, భేషజం, నటన, ఏమీ రాకపోయినా ఏదో తెలిసునట్లు పోజుకొడుతూ అందర్నీ వెటకారంగా చూడ్డం, డిగ్రీలు చెప్పుకుని గొప్పవడం! వీళ్లని చూసి శాంత బెదిరిపోయి లోలోపల ముడుచుకు పోతూంది! కాలేజీ చదువులు వివేకాన్ని పెంచడం లేదు!! వినయాన్ని నేర్పటం లేదు!! అన్ని రకాల ఆడంబరాల్ని పెంచుతున్న ఈ చదువుల "శాలలకి" నిప్పు పుల్ల గీస్తే!

వదిన చదువుకున్నదానిలా కనుపించదు! నా కిది కాంప్లిమెంటు! గొప్ప కాంప్లిమెంటు!

శాంత కోసం నే నేం చెయ్యాలి? చుట్టూ ఉన్న వాతావరణాన్ని తిట్టడమా? చదువు చెప్పించలేని పెద్దల్ని నిందించడమా?

చదువు చెప్పించకపోయి, పెళ్లి చెయ్యలేకపోయి శాంత మనస్సుని రోగిష్టి మనస్సుగా చేస్తున్న పెద్దల్ని ఏం చెయ్యడం?

పెద్దలు ఎవరు? మేమే! ఏం చెయ్యలేని అశక్తులు! ఆ పెద్దల్లో నేనూ ఉన్నాను! అశక్తతకి కారణం ఏమిటి? అశక్తతకి కారకులు ఎవరు? ఈ కారణాలు వెతికే కృష్ణుడు ఉగ్రుడయేడు! ఈ కారణాల వల్లే రాజు మారిపోతున్నాడు! నా బుర్ర పిచ్చెక్కిపోతూంది.

వచ్చి రెండు రోజులైంది. రెండు రోజులూ రాత్రుళ్లు అత్తగారు ఏం తినకుండా పడుకున్నారు!

"నీ కేం తెలీదు, వదినా! అమ్మ కెన్ని వారాలో! ఏడు వారాలూ పూర్తి చేసేస్తే మంచిదని చెపుతున్నాం! వెంకటరమణ మూర్తి కో వారం! సూర్నారాయణమూర్తి కో వారం! పరమశివుడి కో వారం! ఇదిగో,

ఇప్పుడు వీటికి మరో వారం కలిపింది. లక్ష్మింవారం! ! బాబావారం! ఏమిటను కున్నావ్? ఎందు కనుకుంటున్నావ్? ఓ వారం కాంత పెళ్ళి కోసం, మరో వారం చిన్నన్నయ్య తిన్నగా దారికి రావడం కోసం, ఇంకో వారం ఆల్ టుగెదర్ మనందరి శుభం కోసం! మంచి కోసం! ఓ వారం నీ కోసం, అన్నయ్య కోసం స్పెషల్! ! మళ్ళీ ఒంట్లో ఏమన్నా బాగుంటోందా? కాళ్ళనొప్పులు, నడుం నొప్పి! పండగయేది పబ్బమయేది ఏం తినదు కదా!"

"ఏడిసేవ్! వెధవ చెప్పొచ్చావూ నువ్వూను! మిమ్మల్నేమన్నా చెయ్య మంటున్నానా? నా పిచ్చి నమ్మకాలు నావి! మీ రేమన్నా చేస్తున్నారా? మిమ్మ ల్నేమన్నా భజన చెయ్యమన్నానా?" అత్త గారు కసురుకున్నారు. కష్టాలు మూర్ఖ త్వాన్నీ, మౌఢ్యాన్నీ పెంచుతున్నాయి! !

మాలక్ష్మి మందిరం దగ్గర దేవుడి ఫోటోల్లో బాబా ఫోటో ఉండడం చూశాను. కాని ఇంట్లో ఈ పిచ్చి వీళ్ళని పట్టిందనుకోలేదు!

"బామ్మ మరీ అనుకో! శివపూజ చేసుకుంటున్నావుగా! ఆ బాబాకన్నా నీ శివలింగమే గొప్పదంటే వినందే ఇప్పుడు మూడు కోవెళ్ళకి వెళ్ళటం మానేసింది! బాబా భజనకి వెళుతోంది! లక్ష్మింవారం వరకూ ఉంటే నిన్నూ తీసుకెళుతుంది. అవునా, బామ్మా!"

"పోర్నయ్యి, బడుద్దాయి వెధవా!" మునలమ్మగారు ఒంటి కాలిమీద లేచేరు. రమణ అక్కణ్ణుంచి పారిపోయేడు.

"చూసేవా, మనవరాలా, నీళ్ళ రాలు గాయితనాలు! అదిగో ఆ కిష్టిగాణ్ణుంచే కుర్రవెధవలంతా ఇలా తయారవు తున్నారు! పరాయి ఇంటినుంచి వచ్చిన పిల్లయినా, పెద్ద చదువు చదువుకున్నా మీ వదినకి మంచీ, చెడ్డా తెల్సు! మీ లాంటిది కాదు! అవునే, మనవరాలా! లక్ష్మింవారం వరకూ ఆగకూడదూ? మళ్ళీ ఎన్నాళ్ళకి వస్తావో ఏమో! నీ అత్తగారూ, నేనూ అదే అనుకుంటున్నాం. పెళ్ళీ వాలుగేళ్ళయినా మనవరాలు నీళ్ళోసుకోలేదని ఊఁ ఇదవుతున్నాము. బాబాగారికి దణ్ణం పెట్టుకోండి, మళ్ళీ ఈ రోజులకి పండంటి మునిమనమణ్ణి ఎత్తుతారు అన్నారు చిట్టెమ్మగారు! ! వారింట్లోనే భజన! ఉపోషం ఉండమని నీకు చెప్పను అనుకో, ఈ కాలప్పిల్లలు, మీ రుండలేరు! మాలా సాగలేరు. అయితే ఏం? లక్ష్మింవారం లక్ష్మింవారం ధ్యానం చేసుకో, అమ్మా!" మునలమ్మ గారు బోధ చేసేరు.

రాజా, నేను మా జాగ్రత్తలో మేము ఉన్నాము. లేపోతే ఈపాటికి ఇంకా చింతల్లో పడిపోయేవాళ్ళం! మునలమ్మగారి కేం చెబుతాను — మాకు ఇప్పట్నుంచీ పిల్ల లక్కర్లేదని! ! ! ! కావాలనుకున్నప్పుడు బాబాగారి దయ అక్కర్లేదని! చెప్పినా ఆవిడ కోరిక ఆవిడదే! ఆమెతో, అత్తగారితో వాదించ డం, బోధపరచడం అనవసరం! !

లక్ష్మింవారం వరకూ ఉండడానికి వీల్లేదని మర్నాడే బయలుదేరాము. ఈ పరికే రాజా అక్కడ పేపర్లు ఫైవ్ చేసుకోలేక గొడవపడుతూ ఉంటాడు! నేను వెళ్ళి అవి ఫైవ్ చెయ్యాలి!

మామగారు నేను ఉన్నన్నాళ్ళూ నాతో ఏం విశేషించి మాట్లాడలేదు. బయలు దేరుతూ ఉంటే— "రాజుని ఉత్తరాలు రాస్తూ ఉండమని చెప్పమ్మా!" అన్నారు. రాజా ఉత్తరాలు ఆయనకి అనరా!

చిట్టికి నోట్సులు ప్రిపేర్ చేసి పంపుతానని మరోసారి చెప్పాను. తెలీనివి ఉత్తరాల్లో రాస్తే బోధపరుస్తూ జవాబు రాస్తానని ఇంకోసారి చెప్పాను.

రిక్షా ఎక్కబోతూ ఉంటే, "వదిన గాగుల్స్ ఇచ్చేసేవా? లేదురా?" అంటూ మామగారు రమణని అడిగేరు!

నేను వచ్చిందగ్గర్నుంచీ రమణ ఆ గాగుల్సు పెట్టుకునే ఉన్నాడు. చిన్న పిల్లాడు. సరదా ఎక్కువ! బయలుదేరే ముందు తనంత తనే ఇచ్చేసేడు. "తీసుకో, రమణా" అంటూ నేను ఇచ్చేస్తే పొంగి పోతాడు. తనంత తాను కావాలని అడగడు. కాని అతి కష్టం మీద, కిందా మీదా పడి రాజా తిట్టే తిమ్మో నా కా గాగుల్సు కొని ఇచ్చేడు! రమణ కిచ్చేస్తే నేను మళ్ళీ కొనుక్కోలేను! మనస్సుని అదిమి రమణ చేతిలో గాగుల్సు తీసుకున్నాను! ఇదీ బతుకు!

లక్ష్మింవారం వరకూ ఉండలేదు. అయితే ఏం? మునలమ్మగారు చిట్టెమ్మ గారింటికి వెళ్ళి బాబా విభూతి తీసుకొచ్చి భద్రంగా మూట కట్టి ఇచ్చేరు.

రిక్షాలో కూర్చున్నాక మరోసారి చెప్పేరు. "లక్ష్మింవారం లక్ష్మింవారం ధ్యానం చేసుకో, అమ్మా! విభూతి పెట్టుకో. మరిచిపోకు."



శిలాసుందరి
ఫోటో—జి. రామచంద్రరావు (గుంటూరు-1)

ఇదీ బతుకులోని వైచిత్ర్యం!

"బెల్లమావకాయ వాడి కిష్టం అని సీసా నిండా పెట్టేను. మూత కారకుండా బట్ట కట్టే నముకో కాని, మధ్యలో ఓసారి చూస్తూ ఉండు." అత్తగారు జాగ్రత్త చెప్పేరు.

"వదినా! నన్ను నీతోపాటు తీసు కెళ్ళవా? అన్నయ్య దగ్గరా, నీ దగ్గర ఉంటాను." బయలుదేరే ముందు అడిగింది కాంత. ఎప్పుడూ ఏమీ అడగని కాంత! లోలోపల ముడుచుకుపోతున్న కాంత!

నేను జవాబు ఏం చెప్పగలను? అలాగే అని తీసుకెళ్ళలేను. కాదని చెప్పలేను. "మీ అన్నయ్య వస్తారు. ఆయనతో వద్దువుగాని" అన్నాను.

ఇదీ బతుకులో వంచన!

చిట్టి వచ్చి ట్రెయిన్ ఎక్కించేడు. ఇంకో విజయదశమి భూతకాలం లోకి పంపి దిగులుని, దుఃఖాన్ని, విచారాన్ని, పరాజయాల్ని వదిలపడుకుని ఇంటి మంచి రాజా దగ్గరికి వెళుతున్నాను! నిరుత్సాహాన్ని మూట కట్టుకుని రాజా దగ్గరికి వెళుతున్నాను.

ఉన్న నాల్రోజులూ కృష్ణుడు ఇంట్లో తిన్నగా కనిపించలేదు! ఏ రాత్రప్పుడో వచ్చి తెల్లారకుండా మాయమై పోయే వాడు! అలాంటిది ఆశ్చర్యం! ట్రెయిన్ టైమ్‌కి సరిగ్గా ఎక్కణ్ణుంచి వచ్చేడో నా కెదురుగా నిలుచున్నాడు!

"ఏం వదినా! చిన్నపుచ్చుకుని, దిగులుతో వెళుతున్నావా? విచారంగా, భారంగా నువ్వుంటే ఎలా? ఈ సమస్యలు మనింటివే కావమ్మా! ! ఇంటింటివి! !

వదినా! ఇంటింటివి, మొత్తం యావత్తు దేశాన్నీ కుదిపి కుదిపి కదిలిస్తే నే కాని వీటికి జవాబు దొరకదు! అప్పుడే ఇవన్నీ ఓ కొలిక్కి వస్తాయి!

ఆ రోజు వస్తుంది! మనం దిగులు పడకూడదు. నిరుత్సాహ పడకూడదు! ఆ రోజు కోసం మనం పని చెయ్యాలి. నడుం కట్టాలి.

నీ లాంటి వాళ్ళే కుంగిపోతే, దిగాలు పడిపోతే, బెదిరిపోయి నిరుత్సాహ పడితే ఆ రోజు దూరమై పోతుంది!

వదినా! ఛియర్ అప్! వదినా! ఛియర్ అప్! !"

రైలు కదిలి 'ఛియర్ — అప్, ఛియర్ — అప్, ఛియర్ — అప్, ఛియర్—అప్' అంటూ వేగాన్ని అందుకుంది.

కృష్ణుడి కళ్ళలోని స్నేహం, ఆర్ద్రత, పట్టుదల, ఆశావాదం నా వెంట పరుగెట్టుకుంటూ వస్తున్నాయి!! ★